

చిన్నారులపై వీధి కుక్కల దాడి 2



వైస్ ఛైర్‌పర్సన్‌కు సన్మానం 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

22-3-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## టోల్ ప్లాజాల వద్ద సందడి..



**అక్షరటుడే, ఆర్మూర్:** ఉమ్మడి జిల్లాలోని ఇందల్వాయి, భిక్కనూరు టోల్ గేట్లు వాహనదారులతో సందడిగా మారాయి. ఉగాది, రంజాన్ పండుగలను కలుపుకొని నాలుగు రోజులు సెలవు రావడంతో ప్రజలు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వచ్చారు. నిజామాబాద్, అదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్ వాసులు పండుగలకు రాగా.. ఆదివారం తిరుగు ప్రయాణం అయ్యారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద వాహనదారుల సందడి నెలకొంది.



## మైనారిటీలకు మొండిచేయి చూపించిన తెలంగాణ సర్కార్

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** మైనారిటీలకు తెలంగాణ ప్రభుత్వం మొండిచేయి చూపించిందని బీఆర్ఎస్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం మైనారిటీ నాయకుడు నవీద్ ఇక్బాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మైనారిటీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీద్ ఇక్బాల్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో మైనారిటీలకు పెద్దపీట వేశామన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారన్నారు. బడ్జెట్ లో మైనారిటీలకు రూ.4వేల కోట్లు నిధులు కేటాయిస్తామని చెప్పి మోసం చేశారని ఆయన దుయ్యబడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి తోఫాలు అందించడం జరిగిందని.. ప్రస్తుతం అరకొర నిధులతో తోఫాలు ఇస్తున్నారని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కహామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శలు గుప్పించారు. ఒక పథకం కూడా పూర్తిగా అమలు చేయకుండా నిధులను వృథా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ షెహజాద్, మహ్మద్ మతిన్, అబ్దుల్ బారీ, సనా ఉల్లాఖాన్, మహ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ సమి, అబ్దుల్ అజీజ్, మజర్ ఉద్దీన్, తజ్జముల్ ఖాన్, మహ్మద్ హఫీజ్, నయీబ్ ఖురేషి, మహ్మద్ ఇమ్త్యాజ్, యూనిస్, మహ్మద్ ఆరిఫ్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



# అప్‌గ్రేడ్ అయ్యేనా?

■ మహిళా పోలీస్ స్టేషన్ కోసం ఎదురు చూపులు ■ ట్రాఫిక్ ఠాణా ప్రతిపాదన సైతం పెండింగ్‌లోనే..
■ జిల్లా ఏర్పడి తొమ్మిదేళ్లు దాటినా పట్టించుకోని ప్రభుత్వం

**కామారెడ్డి పట్టణంలో మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉంది. జిల్లా ఏర్పాటైనా ఆ డిమాండ్‌పై ఇప్పటికి స్పందన కరువైంది. జిల్లాలో మహిళా సంబంధిత నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దీనిపై ప్రత్యేకంగా షీ టీం పని చేస్తోంది. ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే సమస్యలకు తక్షణ పరిష్కారం లభించే అవకాశం ఉంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ట్రాఫిక్ ఉల్లంఘనలు కూడా అంతే స్థాయిలో పెరుగుతూ వస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉన్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాలకులు వచ్చినప్పుడల్లా చేస్తామని చెప్పడమే తప్ప ముందడుగు వేసిన దాఖలాలు లేవు.

### విస్తరిస్తున్న పట్టణం

కామారెడ్డి జిల్లా కేంద్రం రోజురోజుకు విస్తరిస్తోంది. పట్టణ జనాభా దాదాపు 2 లక్షల వరకు ఉంటుంది. ఇటీవల గ్రామాల విలీనంతో పట్టణం మరింత విస్తరించింది. జిల్లా కేంద్రం కావడంతో పాటు ఇక్కడ వ్యాపార సామ్రాజ్యం రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో పట్టణంలో మహిళా సంబంధిత కేసులు పెరిగిపోతున్నాయి. ఈ కారణంగా పట్టణంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని దాదాపు 15 ఏళ్ల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. మరోవైపు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడం, రోడ్లు సైతం ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగిపోతుంది. ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ ఏర్పాటు చేసినా ప్రజలకు ఇంకా అలవాటు పడలేదు. ఇటీవల ట్రాఫిక్ ఉల్లంఘనలు కూడా పెరిగిపోతున్నాయి. పట్టణంలో ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లేకపోవడంతో ఉన్న ఒక్క స్టేషన్‌కు కేసులన్ని బదిలీ అవుతున్నాయి.

### ఠాణాను అప్‌గ్రేడ్ చేస్తారా

ప్రస్తుతం కామారెడ్డిలో పోలీస్ స్టేషన్ ఒక్కటే ఉంది. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సైతో సహా దాదాపు ఆరుగురు ఎస్సైలు పని చేస్తున్నారు. వీరికి కావాల్సిన వసతులు పట్టణ పోలీస్ స్టేషన్లో లేవని సమాచారం. అయితే కామారెడ్డి పట్టణంలో జనాభాకు అనుగుణంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. మరో స్టేషన్ ఏర్పాటైతే పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందిపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కామారెడ్డిలో మహిళా పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపించారు. అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారి తొమ్మిదేళ్లు దాటుతోంది. అయినా కూడా పోలీస్ స్టేషన్ల ఏర్పాటులో అడుగులు ముందుకు పడలేదు. పట్టణ పరిధి విస్తరిస్తున్న క్రమంలో కేసుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో టూ టౌన్ ఠాణాతో పాటు ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

**అక్షరటుడే, నవీపేట్:** రెంజల్ మండలం సాటాపూర్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం యువజన సంఘం నాయకులు నల్ల నవీన్ మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ 2015లో ప్రారంభించామన్నారు. అధ్యక్షుడిగా సంతోష్(కల్యాపూర్), ఉపాధ్యక్షులుగా మన్నే గంగాధర్ (దూపల్లి), మచ్చకూరి గంగరాజు (కందకుర్తి), జనరల్ సెక్రెటరీగా బండ్ల రాజ్ కుమార్, కార్యదర్శులుగా మమ్మాయి సాయి ప్రకాష్ (కందకుర్తి), ఆర్మూర్ నవీన్ (రెంజల్), కోశాధికారిగా గాండ్ల సాయికుమార్ (నీలా), కాశం భరత్ (కల్యాపూర్), హెల్త్ క్యాంప్ ఇన్‌ఛార్జీగా జీ.సాకేత్ (బాగేపల్లి), శ్యాం (దూపల్లి), యూత్ ఇన్‌ఛార్జీగా గాండ్ల గోపి (బోర్గాం), కాలేవర్ సంజీవ్ (కల్యాపూర్), సభ్యులుగా కంచ శ్రీకాంత్, పాముల అఖిలేష్, బైకొండ రాకేష్, కే లక్ష్మణ్, శ్రీరాజ్వర్ వినోద్, కిషోర్, నీలం సాయి కుమార్, కొట్టూర్ గంగాప్రసాద్, గణేష్, సుమన్, సలహాదారుడిగా కంఠం బాలకృష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు.



## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

**అక్షరటుడే , లింగంపేట :** లింగంపేట మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. కొబ్బరికాయ కుస్తీ మొదలుకొని 100, 200, 500, 600, 1000, 2000, వెండి కడియం వరకు పోటీలు నిర్వహించారు. ఇందులో తలపడేందుకు లింగంపేట, గాంధారి, బాన్సువాడ, మద్నూర్, జుక్కల్, నాందేడ్, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి మల్ల యోధులు తరలివచ్చారు. చివరికి కడెం కుస్తీ విజేత మహారాష్ట్రలోని హుబ్లి ప్రాంతానికి చెందిన అవినాష్ నిలవడంతో ఆలయ కమిటీ సభ్యులు రెండున్నర తులాల వెండి కడియం బహుకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కౌడ రవి, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దుర్శటి అశోక్, ఎస్సై దీపక్ కుమార్, లింగంపేట మండల బాజాప పార్టీ అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్, చేపూరి పోశెట్టి, మారుతి, ముదాం సాయిలు, గుండా బాలకిషన్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రెంజర్లలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అందరూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి'



**అక్షరటుడే, ఇందూరు:** వినియోగదారుల సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి' నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలనే సంకల్పంతో ప్రతి సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్కిల్, డివిజన్, సెక్షన్ ఆఫీసుల స్థాయిలో వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించడమే కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. వినియోగదారులు నేరుగా అధికారులను కలిసి తమ సమస్యలను వివరించవచ్చన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా అప్పటికప్పుడే లేదా నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దీనివల్ల వినియోగదారులకు, విద్యుత్ సిబ్బందికి మధ్య సత్సంబంధాలు మరింత పటిష్టం అవుతాయన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాన్స్‌కో కార్యాలయంలో.. సమీప ట్రాన్స్‌కో కార్యాలయంలో అందజేయాలన్నారు.

## బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పాతర.. బీఆర్ఎస్ బీసీ నాయకుల ధ్వజం



**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ సమాజానికి తీరని అన్యాయం జరిగిందని బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ బీసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ హామీలను కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. వేల్పూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు రాజపూర్ణనందం, మొండి అశోక్, శివసారి నర్సయ్య, బట్టపూర్ ప్రవీణ్ యాదవ్, రేగుంట దేవేందర్ మాట్లాడారు. ఎన్నికల వేళ బీసీలకు ఐదేళ్లలో లక్ష కోట్లు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.12,551 కోట్లు (3.85%) మాత్రమే కేటాయించి మోసం చేసిందని బీసీ నాయకులు మండిపడ్డారు. గత రెండేళ్లలో కేటాయించిన నిధుల్లో 20 శాతం కూడా ఖర్చు చేయలేదని గణాంకాలు చెబుతున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కాలయాపన చేస్తూ స్థానిక సంస్థలు, ఉద్యోగాల్లో బీసీల వాటాను అణచివేస్తున్నారని ధ్వజమెత్తారు. ముదిరాజ్, గంగపుత్ర, గొల్ల కురుమ, గౌడ, పద్మశాలి, రజక వంటి కులాలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారని నాయకులు వాపోయారు. గొర్రెల పంపిణీ, చేనేత, వృత్తి ఆధారిత పథకాలకు సున్నా కేటాయింపులు చేయడం దారుణమన్నారు. రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రస్తావన లేకపోవడం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చకపోతే గ్రామగ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు చౌట్పల్లి రవి, ఆర్మూర్ మహేష్, రేగుల్ల రాములు, దొంకంటి నర్సయ్య, కొత్తపల్లి అశోక్, రామ్ రాజ్ గౌడ్, పాపాయి పవన్, బింగి బాల చందర్, శ్రీనివాస్, పాలేపు అశోక్, రాజేశ్వర్, పర్స దేవన్న, మాణిక్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు సీఎంఆర్ఎఫ్ సాయం అందేలా చర్యలు : ధన్‌పాల్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఆర్థిక ఇబ్బందులు పడుతూ వైద్యం పొందలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా చెక్కులు అందించడం తన బాధ్యత అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ సహాయం అందేలా చూస్తానన్నారు. దరఖాస్తు విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా క్యాంపు కార్యాలయంలో తన బృందం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను ఖచ్చితంగా సెక్రటేరియట్‌కు పంపుతామని చెప్పారు. దరఖాస్తు మొత్తంలో వీలైనంత ఎక్కువగా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 85 మందికి రూ.56,20,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. నాలుగేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నియోజకవర్గంలో ఒకటి కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. నాగారంలో 396 ఇళ్లు, కలెక్టరేట్ సమీపంలో మరో 200 ఇళ్లు ఉన్నాయన్నారు. వీటిని నిర్మించి ఏళ్లు గడిచిందని వాటి కిటికీలు, తలుపులు చోరీకి గురవుతున్నాయని తెలిపారు. ఈ విషయమై అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని.. అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని పేర్కొన్నారు. అయినా వాటిని పేదలకు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి, మఠం పవన్, చింతకాయల రాజేందర్, ఇప్పకాయల కిశోర్, దాంపల్లి జ్యోతి మురళి, బొబ్బిలి సుమిత్ర వేణు, కలిపే అర్చన చిరంజీవి, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు బద్దం కిషన్, పుట్ట వీరేందర్ పాల్గొన్నారు.



## వాసవి పారాయణంలో భిక్కనూరు మహిళలు

**అక్షరటుడే, భిక్కనూరు:** హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాసవి మహాశక్తి మహోత్సవం నిర్వహించారు. ఈ పారాయణంలో భిక్కనూరుకు చెందిన ఆర్యవైశ్య మహిళలు ఆదివారం పాల్గొన్నారు. 30 వేల మందితో నిర్వహించిన ఈ 102 శ్లోకాల వాసవి మాత పారాయణం రికార్డ్ సృష్టించిందని మహిళలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ముని్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మత్తమాల భాగ్యవతి, నాయకులు ప్రశాంత్ గౌడ్‌ను ఆదివారం తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళ టీచర్లు తనను సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. ఇది మహిళల గౌరవాన్ని పెంచే శుభసంకేతమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఏ దేశంలో అయితే స్త్రీలు గౌరవించబడతారో, వారి హక్కులు కాపాడబడతాయో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సంఘ సభ్యులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని.. వాటిని పరిష్కరించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అమీల, వసంత, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కనీరామ్ మెగావత్, మండల ఉపాధ్యక్షులు నౌశ్య, కార్యదర్శులు శివరాములు, వినోద్, గృహిణి కవిత కనిరామ్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.



# 15 రోజులకే పగుళ్లు..!

**బాన్సువాడలోని హన్మాజిపేట్‌లో సీసీ రోడ్డు పనులు నాణ్యత లేమితో చేపట్టారు. నిర్మాణం చేపట్టిన కొన్ని రోజులకే రోడ్లు దెబ్బతిన్నాయి. నాణ్యతా లోపాలతో పగుళ్లు రావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.**

**– అక్షరటుడే, బాన్సువాడ**

■ అధ్వానంగా సీసీ రోడ్డు పనులు ■ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నపట్టణవాసులు

హన్మాజిపేట్‌లో రూ.30 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, వేసిన కేవలం 15 రోజుల్లోనే పగుళ్లు పడడం గ్రామస్థులను ఆగ్రహానికి గురిచేసింది. సాధారణంగా సీసీ రోడ్లు పది సంవత్సరాలకు పైగా మన్నికగా ఉండాల్సి ఉండగా, ప్రారంభ దశలోనే దెబ్బతినడం పనుల నాణ్యతపై అనుమానాలు కలిగిస్తోంది.

### నాణ్యత లోపాలే కారణమా?

రోడ్డు నిర్మాణంలో సరైన మెటీరియల్ వినియోగించకపోవడం, తగిన క్యూరింగ్ చేయకపోవడం, తక్కువ నాణ్యత ఉన్న ముడిపదార్థాల వినియోగం వంటి అంశాలు పగుళ్లకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. నిర్మాణ సమయంలో సాంకేతిక ప్రమాణాలను పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్‌కు వరం

పనుల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నాణ్యత తనిఖీలు కేవలం పేరుకే జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద వచ్చిన నిధులు గ్రామాభివృద్ధికి వినియోగించాల్సి ఉండగా, ఇలాంటి పనుల వల్ల ప్రజాధనం వృథా అవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తక్కువ కాలంలోనే రోడ్డు దెబ్బతినడం వల్ల మళ్లీ మరమ్మతుల కోసం అదనపు ఖర్చు ఏర్పడే అవకాశం ఉంది.

## 'రైతు భరోసా' విడుదల కార్యక్రమం వీక్షణ



**అక్షరటుడే, కోటగిరి:** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు రైతు భరోసా నిధులను విడుదల చేసింది. సిద్దిపేట జిల్లా సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం నిర్వహించిన సభలో తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేశారు. కాగా.. ఈ కార్యక్రమాన్ని పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్ కల్లూరి సంధ్యా హన్మాండ్లు రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఏఈవో సుప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా హర్‌ఘర్ జల్ మహోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి మండలంలోని ఆజామాబాద్‌లో ఆదివారం ఘనంగా జల మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. హర్ ఘర్ జల్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. తాగు నీరు వృథా చేయకూడదని సూచించారు. మిషన్ మిషన్ భగీరథ నీటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏఈఈలు, డీఈఈ, ఈఈ, ఇతర అధికారులు, ఆజామాబాద్ సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఉత్సవాల సభకు శివాపూర్ గ్రామస్థులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సిద్దిపేటలో జరుగుతున్న రైతు ఉత్సవాల సభకు శివాపూర్ నాయకులు తరలివెళ్లారు. గ్రామ సర్పంచ్ నాగరాజు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, గ్రామ పెద్దలు సంగయ్య, బుమేశ్, నవీన్, అశోక్ సభలో పాల్గొనేందుకు వెళ్లారు. ఆయిల్ పాం పరిశ్రమ ప్రారంభంలో పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ ఆలయ ఉత్సవాలు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గండివేట్ గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామంలో బోనాలను ఊరేగించారు. పోతరాజు విన్యాసాల మధ్య ప్రతి ఇంటి నుంచి బోనాలను ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయం వరకు తీసుకెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో ప్రతియేటా పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని రెడ్డి చెరువు హనుమాన్ ఆలయ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం స్థానిక కౌన్సిలర్ కొడిగెల మల్లయ్య మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయానికి వచ్చే ప్రతి ఒక్క భక్తుడు ఆలయం శుభ్రంగా ఉండేలా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగడమీది సాగర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొగడమీది ప్రశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, జంగిడి భోజన్న, బాశెట్టి పెద్ద గంగారాం, సాయి కిరణ్, బట్టు సుమన్, డ్రైవింగ్ స్కూల్ వేణు, రాహుల్ రాజ్, యాదగిరి, కుంకింగ్ నరేష్, గణేష్, కృషి వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట సర్పంచ్ కొయ్యల వినోద రాజా గౌడ్ అన్నారు. గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయం వద్ద రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ కృషితో మా గ్రామం అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. వీటితో పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే చొరవతో గ్రామాభివృద్ధకి నిధులు మంజూరవుతున్నాయని సర్పంచ్ తెలిపారు. సీసీ రోడ్లకు రూ.25 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మహిళా సంఘ భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయించారని వివరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సొంత నిధులతో బోరు వేయించారని తెలిపారు. అలాగే ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు బిల్లులు మంజూరు చేయించారని చెప్పారు. గ్రామానికి 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్‌వోసీలు, కల్యాణలక్ష్మి చెక్కులు గ్రామ ప్రజలకు అందేలా కృషి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఇంతకాలం ఇన్‌ఛార్జి సెక్రెటరీతో ఉన్న గ్రామానికి వెంటనే కార్యదర్శిని ఎమ్మెల్యే నియమింపజేశారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రాజు యాదవ్, మాజీ సర్పంచ్ గోచిక చిరంజీవులు, సొసైటీ మాజీ వైస్ ఛైర్మన్ ఎల్లప్ప, వార్డు సభ్యులు గండ్ల సాయిరాం, నర్సింలు, బంధం భూమయ్య, బట్టి సాయిగౌడ్, నరేందర్ బాల్‌రాజ్, నాగరాజ్ ఆలయ అర్చకులు శివాయప్ప పాల్గొన్నారు.

## డీసీసీ కార్యవర్గంలో రెంజర్లకు ప్రాతినిధ్యం



**అక్షరటుడే, ముప్కాల్ :** ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గంలో చోటు లభించింది. జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా మగ్గిడి ముత్యం రెడ్డి, సెక్రెటరీగా ఆకుల రమేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మేడిపల్లి ముత్యం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమిన్, నారాయణ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులపై వీధి కుక్కల దాడి..



**అక్షరటుడే, కామారెడ్డి:** వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. కనిపించిన వారిపై దాడికి తెగబడుతున్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పోసానిపేట గ్రామంలో ఆరుగురిపై దాడి చేసిన విషయం తెలిసిందే. తాజాగా దోమకొండ మండలంలోని చింతమాన్ పల్లి గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. గ్రామంలో ఇద్దరు చిన్నారులు ఆదివారం బయట ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో అటువైపుగా వెళ్తున్న కుక్కలు చిన్నారులపై దాడి చేశాయి. ఈ దాడిలో చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఐదేళ్ల చిన్నారి హర్షిని, 16 నెలల చిన్నారి జాహ్నవిలను జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చిన్నారుల పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో ఇద్దరిని హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు.

## ప్రజల్ని చైతన్యం చేయడానికి అరుణోదయ కృషి

**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రజల్ని చైతన్యం చేయడానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసు అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆర్మూర్ పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుణోదయ మహాసభలను ఏప్రిల్ 10, 11 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలుత అంజయ్యభవన్ ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి కళాకారుల ప్రదర్శన సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి చేరుకొని అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సభకు రాష్ట్ర అధ్యక్షుడు వేణు అధ్యక్షత వహించనుండగా.. ముఖ్య అతిథులుగా ప్రముఖ జర్నలిస్టు సతీష్ చందర్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీ, రైసింగ్ న్యూ డెమోక్రసీ సహసంపాదకులు కె.గోవర్ధన్, కానూరి తాత కూతురు బేబక్క, ఉదయగిరి, పాల్గొంటారని దాసు తెలిపారు. ఏప్రిల్ 11న మార్క్స భవన్‌లో రాష్ట్ర మహాసభల ప్రారంభోపన్యాసం ప్రొఫెసర్ కాశీం, వక్తలుగా ప్రొఫెసర్ వినయ్ బాబు, లెల్లే సురేష్, అంబిక, పాల్గొంటారని ఆయన తెలిపారు. 1974లో అరుణోదయ ఆవిర్భవించిన నుంచి 52 వసంతాల సుదీర్ఘ పయనంలో ప్రజా సంస్కృతి కోసం, ప్రజా కళారూపాలతో కృషి చేసిందని దాసు తెలిపారు. ప్రజా సంపదను కొల్లగొట్టే శక్తులకు వ్యతిరేకంగా అరుణోదయ పోరాటం చేస్తోందని దాసు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యుడు నరేష్ మాట్లాడుతూ.. అరుణోదయ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేశ్, లక్ష్మణ్, మల్లేశ్, నరేందర్ ప్రజా సంఘాల నాయకులు ప్రిన్స్, నర్సయ్య, సొప్పరి గంగాధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

